*

# "సాహితికి" కథ

తక్షణం కథ రాసి పంపవలసిం దని "సాహితి" సంపాదకుడు ఫర్మానా పంపినాడు. రాతాము, రాయవచ్చును అని రెండుమూడురోజులు ఎలాగో గడపినాను. ఇంక తప్పదు గదా అనుకొని ఒకనాటి రాత్రి వెన్నెట్లో పరుపు వేసుకొని, తమలపాకులు పక్కను పెట్టుకొని, దీపానికి ఎదురుగా కాగితాలు పెట్టుకొని, కూచుని ఆలోచించడం మొదలు పెట్టినాను. కథ సాంఘికం చేతామా, చారిత్రకం చేద్దామా, అపరాధపరిశోధకం చెయ్యడమా అని ఆలోచనలోకి దిగినాను. ఎంతకూ తెగడం లేదు. ఇంతలో పరుగెత్తుకొంటూ వచ్చినాడు మా చిట్టి బాబు; వచ్చి పక్కను కూచున్నాడు.

కూచుని "నాన్నా, నాన్నా, అమ్మోం నిద్దరోయిం ది" అన్నాడు చిట్టి బాబు.

నేను ఆలోచనలో మునిగి వుండి "ఊహూఁ" అన్నాను.

"నాన్నా, మరి నా పే రేవరు?"

"నీపేరా? చిట్టి బాబు."

చిట్టిబాబు సమాధానానికి సంతోషించి పరుపు మీద వెల్లకిలా పండుకొని ఆకాశంకేసి చూస్తున్నాడు. నేను సాంఘికకథ వ్రాతామని దృఢ పరుచుకుని ఏం పేరు పెట్టితే బాగుంటుం దని ఆలోచించాను. పేరును బట్టి ఇతి వృత్త మంతా బోధ పడవలె; మర్రిగింజలో చెట్టంతా ఇమిడి వుండవలె. ఏం పేరు పెట్టను? కమల అంటే బాగుంటుంది. అయితే కమల కథ కంతకూ నాయిక కావలసి వుంటుంది. కమలను చిన్నపిల్లను చెయ్యడమా, కాపరం చేస్తూ వున్న—

—నాన్నా!

—ఊఁ.

—మరీ, నా పేరు చిట్టిబా బంటే బుల్లెమ్మ ఆక్షేపించిం దేం?

—ఊఁ అని ఊహాసూత్రాన్ని అందు కొందా మను కొన్నాను.

—ఏం నాన్నా, ఆక్షేపించిం దేం?

—ఎవరూ?

—చెల్లాయి.

—ఏ మని?

—పేరు బాగుంది కాదుట.

—బాగుం దమ్మా! మాట్లాడకు రవంత సేపు.

అయితే కమలను కాపరం చేస్తూ వున్న స్త్రీని చేస్తే బాగుంటుందా? అప్పుడు కథలో ఏమి చేయించాలి ఆవిడ చేత? ఆత్మ త్యాగమా? ఈ కాలంలో సర్వసాధారణ మైపోయింది. సహగమనమా? దానికోసం శతాబ్దులు వెనక్కు వెళ్ళాలి. అయితే విషాద సూచకమైన కథకు కమల అనే ముద్దు పేరు బాగుంటుందా? బాగుండదు. పేరు మార్చాలి. ఏ మంటే బాగుంటుంది?

—నాన్నా!

—ఓ.

—చంద మామ ఎక్క డున్నాడో చెప్పకో.

—అదుగో!

—నాన్నా!

—ఓ.

—చంధమామ అక్క డెందు కున్నాడు నాన్నా!

—వూరికేనే?

—నాన్నా!

—ఓ.

—చెల్లాయికి చందమామ లేదు కాదూ!

—అవు నమ్మా, పడుకో. మాట్లాడకు.

మాట్లాడకుండా చూస్తూ పడుకొన్నాడు చిట్టిబాబు.

కమలపేరు తీసివేసి వీరమతి అంటే? వీరమతి అట్టే నచ్చడం లేదు. పూర్వకాలపుపేర్లు ఏవైనా పెట్టితే కథ నిజ మయినట్టు తోస్తుంది. పూర్వపుపేర్లు ఏమున్నాయి? ఏదీ, అహల్య— ఉహూం. నాయకురాలు—చ్. గంగమ్మ— ఉహూం. ఏకవీర— బాగుంది. శక్తిపేరూ అయినట్టుగా వుంది, పూర్వకాలపు పేరూ అవును. కథపేరు ఏకవీర పెట్టుకోవచ్చును. అయితే—

—నాన్నా!

—ఓయి.

—నాకు దాహ మవుతోంది.

—లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తాగు.

—అమ్మ నిద్దర పోతున్నది.

—నువ్వు వెళ్ళి బిందెలోనీళ్ళు ముంచుకు తాగు.

—నాకూ నిద్ద రొస్తూంది.

మంచినీళ్ళు ఇస్తేనేకాని కొరుక్కుతింటాడని లేచి మంచినీళ్ళు తీసుకు వచ్చి యిచ్చి నిద్ర పొమ్మన్నాను. కాకితాలముందర మళ్ళీ కూచుని ఆలోచన. ఏకవీర చేత పురుషవేషం వేయించి యుద్ధం చేయిస్తే ఎలా వుంటుందో. కాకపోతే ఏకవీరకు దుర్మార్గుడైనభర్త వున్నట్టూ, అతను భార్యను అనాదరణ చేస్తూవున్నట్టూ—

—నాన్నా!

—మళ్ళీ యెందుకూ?

—చెల్లాయికి ముసుగులు చేయిస్తున్నావు. నాకో!

—నీకూనూ.

—మరి, ఇందాక నువ్వు చెల్లాయిని ఎత్తుకుని ముద్దుట్టుకున్నావు కదా, నన్ను ఎత్తుకోలేదేం!

—నిన్నూ ఎత్తుకుంటా.

—నాన్నా! నన్నిప్పు డెత్తుకోవూ?

—ఉహుఁ.

—ఎత్తుకోవు నాన్నా?

—రేపు. ఈవాళకి నిద్దరో.

—నిద్దర పోతే నా కేం కొనిపెడతావు?

—మిఠాయి.

—నా కొద్దు.

—పోనీలే.

—నాకూ, నాకూ, నువ్వెక్కుతావే అలాంటి బైస్కిల్ కావాలి.

—అలాగే. నిద్దరో.

—కొనిపెడతావా?

—ఆ.

చిట్టిబాబు కళ్ళు మూసినాక. గడియారంలో పది గంట లయింది. అయితే అయింది, కథ రాసి పడుకో వచ్చు ననుకొన్నాను. అన్నట్టు ఎక్కడ వున్నాము-ఏకవీరకూ దుర్మార్గుడైన భర్త. భర్త అనాదరణ పడలేక, పడలేక ఏమిటి చెయ్యడం? నూతిలో పడితే! కథ చాలా పొట్టిదై పోతుంది. తిరగబడితే—నాయి కాలక్షణాలకు భంగం. పుట్టింటికి వెళ్ళిపోతే—వెళ్ళి పోయి? అవును, చెప్పకుండా పుట్టింటికి వెళ్ళిపోతే, భర్త యింటికి వచ్చి—

—నాన్నా!

—ఓ. ఇంకా నిద్ర పోలేదూ?

—పోయాను. కాని నాకు ఓనమాలు వచ్చాయి.

—వస్తే సంతోషమే.

రాత్రి పదిఘంటలకు ఓనమాల గొడవ యెందు కనుకొన్నాను.

—నాన్నా, నాకు అ ఆ లు చెప్పుతా నన్నావు చెప్పవూ?

—ఇప్పుడు కాదు. పడుకో.

—ఎప్పుడు నాన్నా?

—రేపు.

—రేపు బళ్లోకి వెళ్ళేదీ నాన్నా?

—వెళ్ళు.

—ఆఁ వెళ్ళను.

—పోనీ, మానెయ్యి.

—మానేస్తే అమ్మ కొట్టదూ?

—కొట్టదులే.

—కొడుతుంది నాన్నా!

—కొట్ట దంటూంటే. నిద్ర పో.

మళ్ళీ రవంతసేపటికి చిట్టిబాబు నాన్నా అన్నాడు.

—ఓ.

—నువ్వేమిటి రాస్తున్నావు?

—కథ.

—నేనుకూడా రాయనా?

—ఇప్పుడు కాదు.

—నాకు కథ చెప్పవు నాన్నా?

—నిద్దరోతే చెప్తాను.

—చెపితే నిద్దరోతాను.

చిట్టిబాబు పట్టు మంకుపట్టు! పైగా నాదగ్గిర చను వు. ఇంక చేసే దేమిటి? కాకితాలు బొత్తుపెట్టి, ఒక మూల పడవేసి, దీపం ఆర్పి, పడుకొని, నూటపన్నెం డోమారు...అనగా అనగా వకరాజు. ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకు

వెళ్ళి......కథ కంచెకు వెళ్ళింది, మనం ఇంటికి వచ్చాము అనేకథ చెప్పినాను. చీను దగ్గిరికి వచ్చేటప్పటికే నూట పన్నెండో మాటు చిట్టిబాబు నవ్వినాడు. తరవాత ఒకకాలు నామీద వేసి ఒక చెయ్యి నా ముఖంమీద వేసి ఇంతలో నిద్రపోయినాడు.

సాహితికి కథ రాయలేదని సంపాదకుడు కోపపడతాడు. కథ వ్రాయడం ఈవరసను వున్నది!

౧౯–౨౧